కొనసాగుతున్న సీసీ డ్రైనేజీ నిర్మాణ పనులు

బీర్కూర్ మండలంలో కొనసాగుతున్న డ్రైనేజీ నిర్మాణ పనులు

బాన్సువాడ, అక్టోబర్ 12 : బీర్కూర్ మండల కేంద్రంలో రోడ్డు విస్తరణ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. బీర్కూర్‌లో ఇప్పటికే ప్రధాన రహదారి పనులు ప్రారంభం అయ్యాయి. రోడ్డుకు ఇరువైపులా సీసీ డ్రైనేజీ నిర్మాణ పనులు జోరుగా కొనసాగుతున్నాయి. రోడ్డు నిర్మాణ పనులకు స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి ప్రత్యేక కృషితో సుమారు ఏడు కోట్ల రూపాయలు మంజూరు కావడంతో పనులు స్పీడ్‌గా సాగుతున్నాయి. ఎన్నో రోజులు కల నెరవేరడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

దివ్యాంగులకు ఫిజియోథెరపీ

దివ్యాంగులకు చేస్తున్న ఫిజియోథెరపీని పరిశీలిస్తున్న ఎంఈవో నాగేశ్వర్‌రావు

బాన్సువాడ రూరల్, అక్టోబర్ 12 : బాన్సువాడలోని భవిత భవనంలో గురువారం దివ్యాంగులకు ఫిజియోథెరపీ పరీక్షలను నిర్వహించారు. మండల విద్యాధికారి నాగేశ్వర్‌రావు ఫిజియోథెరపీ కేంద్రాన్ని సందర్శించి దివ్యాంగులకు అందుతున్న చికిత్సల గురించి అడిగి తెలుసుకున్నారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ఎనిమిది మంది దివ్యాంగులకు ఫిజియోథెరపీ చేసినట్లు వైద్యుడు గంగాధర్ తెలిపారు. దివ్యాంగుల కోసం ప్రతి గురువారం ఫిజియోథెరపీ నిర్వహిస్తామని చెప్పారు. దివ్యాంగుల తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సిబ్బంది వసంత్‌కుమార్, పద్మ ఉన్నారు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి

పిట్లం, అక్టోబర్ 12: వాహనదారులు రహదారిపై ప్రయాణించే సమయంలో ఎన్నికల నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని తనిఖీ బృందం అధికారి సాయాగౌడ్ అన్నారు. గురువారం ఆయన మండల కేంద్రంలోని పిట్లం-బాన్సువాడ రహదారిపై వాహనాల తనిఖీ చేపట్టారు. ఎవరైనా డబ్బులు తీసుకెళ్లాల్సి వస్తే సంబంధిత ధ్రువపత్రాలు వెంట తెచ్చుకోవాలని సూచించారు. ఆయన వెంట తనిఖీ బృందం సభ్యులు, పోలీసు సిబ్బంది ఉన్నారు.

పోచారం ప్రాథమిక పాఠశాలలో బతుకమ్మ సంబురాల్లో పాల్గొన్న విద్యార్థులు

ముత్యంపేటలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

బాన్సువాడలోని బాలికల ఎస్టీ వసతి గృహంలో..

ఘనంగా బతుకమ్మ సంబురాలు

బాన్సువాడ రూరల్/బీబీపేట్/కామారెడ్డి/ మాచారెడ్డి/ భిక్కనూరు/దోమకొండ/ బాన్సువాడటౌన్, అక్టోబర్ 12 : బాన్సువాడ మండలంలోని పోచారం గ్రామంలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గురువారం బతుకమ్మ సంబురాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు గునుగు, తంగేడు, బంతి, చామంతి తదితర పూలతో బతుకమ్మను పేర్చారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు బతుకమ్మ పాటలకు లయబద్ధంగా బతుకమ్మ ఆడారు. అనంతరం బతుకమ్మలను గ్రామంలోని చెరువులో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సంతోష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. బీబీపేట్‌తోపాటు ఆయా గ్రామాల్లోని పలు పాఠశాలల్లో బతుకమ్మ వేడుకలను నిర్వహించారు. బీబీపేట్‌లోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయినులు బతుకమ్మ పండుగ విశిష్టతను విద్యార్థినులకు తెలిపారు. మాందాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బతుకమ్మ వేడుకను జరుపుకొన్నారు. మాచారెడ్డి మండలంలోని కొత్తపల్లి ప్రాథమిక పాఠశాలలో గురువారం బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ప్రశాంతి విద్యార్థులకు బతుకమ్మ పండుగ విశిష్టతను తెలియజేశారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.భిక్కనూర్‌తోపాటు ఆయా గ్రామాల్లోని పలు పాఠశాలలో బతుకమ్మ సంబురాలను నిర్వహించారు. జంగంపల్లిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బతుకమ్మ సంబురాలు జరుపుకొన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. కామారెడ్డిలోని వివేకానంద బీటాపర్స్ పాఠశాలలో గురువారం బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ గురువేందర్ రెడ్డి, డైరెక్టర్స్ రవీరెడ్డి, వీరభద్రప్ప, రాజేశ్, మంజీరా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ, అకడమిక్ కౌన్సిలర్స్ ప్రభు, శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు. కామారెడ్డిలోని ఆర్కిడ్స్ పాఠశాలలో బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్, ప్రిన్సిపాల్ గోవర్ధన్‌రెడ్డి, డైరెక్టర్ సదాశివరెడ్డి, ఉపాధ్యాయినులు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు. దోమకొండ మండలంలోని ఆయా గ్రామాల్లో బతుకమ్మ వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. గ్రామ ప్రధాన చౌరస్తాల వద్ద బతుకమ్మను ఉంచి ఆడిపాడారు. అనంతరం బతుమ్మలను గ్రామ చెరువుల్లో నిమజ్జనం చేశారు. బాన్సువాడ ఎస్టీ వసతి గృహంలో బతుకమ్మ ఉత్సవాలను వార్డెన్ విజయభారతి, సిబ్బంది ఆధ్వర్యంలో నిర్వహించగా ఎస్సీ ప్రభుత్వ వసతి గృహంలో వార్డెన్ గంగసుధా ఆధ్వర్యంలో నిర్వహించారు.

కామారెడ్డిలోని ఆర్కిడ్స్ పాఠశాలలో బతుకమ్మ ఆడుతున్న ఉపాధ్యాయినులు, విద్యార్థినులు

జంగంపల్లిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో..

కొత్తపల్లి ప్రాథమిక పాఠశాలలో..

బీబీపేట బాలికల పాఠశాలలో..

మండల సర్వసభ్య సమావేశం

కామారెడ్డి రూరల్, అక్టోబర్ 12 : కామారెడ్డి మండలం దేవునిపల్లి గ్రామ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ పిప్పిరి ఆంజనేయులు ఆధ్వర్యంలో మండల సర్వ సభ్య సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. మండలంలోని గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, మిగిలి ఉన్న పనులను పూర్తి అయ్యేలా చూస్తానని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఉరుదొండ నరేశ్, ఏఈ శ్రీనివాస్, ఎంపీడీవో నాగేశ్వర్, మండలంలోని పలు గ్రామాల సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి దసరా సెలవులు

కామారెడ్డి, అక్టోబర్ 12 : బతుకమ్మ, దసరా పండుగల సందర్భంగా ఈ నెల 13(శుక్రవారం) నుంచి 25వ తేదీ వరకు జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు సెలవులు ప్రకటించినట్లు డీఈవో రాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సెలవు దినాల్లో ఎవరైనా ప్రైవేట్ తరగతులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. పాఠశాలలకు సెలవులు ప్రకటించడంతో హాస్టల్‌లో ఉన్న విద్యార్థులు తమ సొంత గ్రామాలకు వెళ్లారు.

నేటి నుంచి జోనల్‌స్థాయి పోటీలు ప్రారంభం

బాన్సువాడ రూరల్, అక్టోబర్ 12 : బాన్సువాడ మండలంలోని బోర్లం క్యాంపు సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో నేటి నుంచి 16వ తేదీ వరకు 9వ జోనల్‌స్థాయి స్పోర్ట్స్ సమ్మిట్ -2023 పోటీలు నిర్వహిస్తున్నారు. ఇందుకోసం పాఠశాల క్రీడా మైదానాన్ని సిద్ధం చేశారు. 3వ జోన్ పరిధిలోని కామారెడ్డి, సిద్దిపేట్ జిల్లాల గురుకుల పాఠశాలలకు చెందిన 1,275 మంది విద్యార్థినులు క్రీడా పోటీల్లో పాల్గొంటున్నారు. అండర్-14,17,19 విభాగాల్లో గేమ్స్, అథ్లెటిక్ పోటీలు నిర్వహిస్తున్నామని ప్రిన్సిపాల్ పద్మకుమార్ గురువారం తెలిపారు. క్రీడల ప్రారంభోత్సవానికి కలెక్టర్ జితేశ్ వీ పాటిల్‌తోపాటు ఆర్‌సీవో అలివేలు పాల్గొంటున్నారని ఆమె వెల్లడించారు.

ఈ నెల 14న ఆర్చరీ జిల్లా స్థాయి ఎంపిక పోటీలు

దోమకొండ, అక్టోబర్ 12 : దోమకొండ గడీకోటలో ఈ నెల 14న జిల్లా స్థాయి ఆర్చరీ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా అసోసియేషన్ కార్యదర్శి నర్సింహారెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీనియర్, జూనియర్ విభాగంలో పాల్గొనే క్రీడాకారులు ఉదయం 8 గంటల్లోగా నాలుగు ఫొటోలు, ఆధార్‌కార్డు, బోనాఫైడ్, ధ్రువపత్రాలతో హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో కోచ్ ప్రతాప్‌దాస్ పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు

- బాన్సువాడ ఆర్డీవో భుజంగరావు
- నియోజకవర్గంలో 73 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు
- అభ్యర్థులు సువిధ పోర్టల్‌లో అనుమతి కోసం దరఖాస్తు చేసుకోవాలి

బాన్సువాడ, అక్టోబర్ 12 : ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని బాన్సువాడ ఆర్డీవో భుజంగరావు అన్నారు. ఆర్డీవో కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బాన్సువాడ నియోజకవర్గంలో 258 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. వాటిలో 73 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు. ఆయా పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్, సీసీ టీవీ మైక్రో అబ్జర్వర్స్, వీడియో తీస్తారని అన్నారు. నియోజకవర్గంలో లక్షా 92 వేల 841 ఓటర్లు ఉన్నారని చెప్పారు. ఓటర్ నియమ నిబంధనల పత్రాలను, ఓటర్ వివరాల స్లిప్పులను బీఎల్‌వోల ద్వారా అభ్యర్థుల నామినేషన్ వేసిన ఐదు రోజుల్లోగా ఇంటింటికీ పంపిణీ చేస్తారని తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద అసిస్టెన్స్ బూత్ ను ఓటర్లకు వారి వారి వివరాలను తెలిపేందుకు బీఎల్‌వోల ద్వారా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పీడబ్ల్యూడీ (దివ్యాంగులు)తోపాటు 80 సంవత్సరాలు పైబడిన వారి కోసం ఫాం-12డీతోపాటు బాక్సులు ఇచ్చిన సిబ్బందితో ఇంటింటికీ తిరిగి ఓటు వేయిస్తామని తెలిపారు. ఉద్యోగులకు వారికి పోస్టల్ బ్యాలెట్ అందిస్తామని తెలిపారు. నియోజకవర్గంలో ప్రత్యేకంగా ఐదు మహిళా పోలింగ్ కేంద్రాలు, ఐదు మోడల్ పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని, ఐదింటిలో ఒకటి ఏకో ఫ్రెండ్లీ పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఆర్డీవో తెలిపారు. బాన్సువాడ నియోజకవర్గంలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన 48 గంటల్లోపే ఆయా పార్టీల నాయకుల ఫ్లెక్సీలు, ఫొటోలను తొలగించారని ఆర్డీవో తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లో కోడ్ పడిన 72 గంటల్లో రాజకీయ నాయకుల ఫొటోలను తీసివేయాలని, లేని యెడల చర్యలు ఉంటాయన్నారు. నిజామాబాద్ జిల్లాలోని ఆరు మండలాలకు రెండు, కామారెడ్డి జిల్లాలోని మూడు మండలాలకు ఒకటి చొప్పున స్టాటిక్స్ సర్వేలైన్స్ టీం సభ్యులు పరిశీలిస్తారన్నారు. ప్లైయింగ్ స్క్వాడ్ టీం సభ్యులు ఆరు మండలాలకు రెండు, మూడు మండలాలకు ఒకటి చొప్పున అధికారుల బృందం ఉంటుందని తెలిపారు. వీరంతా అభ్యర్థుల ఖర్చు, ర్యాలీ, ధర్నాలు, సమావేశాలు, వాహనాల వివరాలను పరిశీలిస్తారని చెప్పారు. ఈసారి సువిధ పోర్టల్‌ను అందుబాటులోకి తెచ్చిందన్నారు. పోర్టల్‌లో సింగిల్ విండో విధానం ద్వారా మైకు మొదలుకొని వాహనాలు, మీటింగ్ వివరాలు, ర్యాలీలు, సభలు తదితర అన్ని కార్యక్రమాల అనుమతి కోసం దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని అభ్యర్థులు సద్వినియోగం చేసేకోవాలని సూచించారు. నామినేషన్ వేసే వ్యక్తి అఫిడవిట్‌లో కచ్చితంగా పూర్తిగా పూరించాలని, ఎక్కడ కూడా ఖాళీగా విడిచి పెట్టవద్దని తెలిపారు.

మాట్లాడుతున్న ఆర్డీవో భుజంగరావు